క్లుప్తంగా

పింఛన్ తొలగింపు



పక్షవాతంతో మంచానికే పరిమితమైన పసలపూడి ప్రసాద్

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంకు చెందిన వృద్ధుడు ప్రసాద్ గత కొద్ది సంవత్సరాలుగా పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమయ్యాడు. బాధితుడికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 90 శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ అందజేశారు. దీంతో ప్రతీ నెల పింఛన్ పొందుతు ఆ సొమ్ముతోనే కాలం వెళ్లదీస్తున్నాడు. ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రీవెరిఫికేసన్ పేరిట పరిశీలన చేసి 82 శాతం మాత్రమే అంగవైకల్యం ఉన్నట్లు నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆసరాగా ఉన్న పింఛన్ నిలిచిపోతుందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లపూడి మండలంలో దివ్యాంగ పింఛన్ పొందుతున్న 30 మంది లబ్ధిదారులను అనర్హత జాబితాలో పెట్టారు. అయితే ఇందులో అర్హత ఉన్నవారు తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చునని అధికారులు చెబుతున్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న పావనీ కుమారి

నల్లజర్ల: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ప్రచార కమిటీ సమావేశానికి ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ వామిశెట్టి పావనీ కుమారి పాల్గొన్నారు. ఈ మేరకు సమావేశంలో తూర్పు గోదావరి జిల్లాలో వివిధ స్థానిక సమస్యలను పార్టీ ప్రచార విభాగం కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు ఆమె మీడియాకు తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తాను సూచించినట్టు చెప్పారు. పార్టీని బలోపేతం చేయడానికి ఏవిధంగా పనిచేయాలనే విషయాలపైన చర్చించినట్టు చెప్పారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

పెరవలి: పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా ముక్కామల గ్రామ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ నారాయణ అప్పారావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిరుపేదలకు ఆపన్నహస్తం అభినందనీయం



గోపాలపురం గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్సై, మానవత సభ్యులు

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అభినందనీయమని గోపాలపురం ఎస్సై పి.మనోహర్ అన్నారు. మండలంలోని చిట్యాలలో శుక్రవారం మానవత ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శాంతి ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై మనోహర్ బీ.ఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రభుత్వాలపై ఆధారపడే ఈ రోజుల్లో మేము సైతం అంటూ మానవత సంస్థ నిరుపేదలను గుర్తించి వారికి ఆపన్నహస్తం అందిస్తుండం అభినందనీయమన్నారు. మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు ఫణి కిషోర్, జోగేంద్రప్రసాద్, జె.వెంకట్,జె.సూర్యచంద్రం పాల్గొన్నారు.

యూరియా లొల్లి

- ఎరువుల కోసం రైతుల పాట్లు
- కొరత లేదంటున్న అధికారులు
- సొసైటీల వద్ద ఘర్షణ పరిస్థితులు



మలకపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం రైతుల నిరీక్షణ

తాళ్లపూడి: తెల్లవారుజామున పొలంబాట పట్టాల్సిన రైతు అర్ధరాత్రి వరకు యూరియా కోసం దుకాణల వద్ద పడిగాపులు కాయవల్సిన పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడింది. సరిపడా నిల్వలు ఉన్నాయని..రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు చెబుతున్నా అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు దర్శనామిస్తున్నాయి. ఖరీఫ్‌లోని పంటల ఎదుగుదల దశలో ఉండగా..అవసరమైనంత మేర యూరియాను పొందలేక పోతున్నామని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క అధికారులు మాత్రం రావాల్సిన మేర కంటే ఎక్కువగా యూరియా దిగుమతి అయ్యిందని చెబుతున్నారు. ఈ గందరగోళ పరిస్థితుల్లో పలువురు రైతులు అవసరం లేకున్నా యూరియా దొరకదేమోనని భారీ మొత్తంలో ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ చేయడంతో కొరతకు కారణమవుతుంది. దీంతో యూరియా వచ్చిందంటే చాలు సొసైటీల వద్దకు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో రైతులు మధ్య ఘర్షణ వాతావరణం కూడా నెలకొంటుంది. ఇటీవల కొవ్వూరు సొసైటీ వద్ద కూడా అలాంటి పరిస్థితితే నెలకొంది.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో ఖరీఫ్ వరి నాట్లు పూర్తయ్యి దుబ్బు కట్టి, చిరు పొట్ట దశలో ఉన్నాయి. చాలా చోట్ల మొదటి దఫా, రెండో దఫా ఎరువులు వేస్తున్నారు. నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో సుమారు 27 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగుచేస్తున్నారు. పొలాల్లో పంట ఎదుగుదలకు అవసరమైన యూరియా చల్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో యూరియా కొరతతో నియోజకవర్గంలో యూరియా సొసైటిల్లో మాత్రమే విక్రయాలు చేస్తున్నారు. ప్రైవేట్ డీలర్లు ఎరువు విక్రయాలు నిలిపివేశారు. దీంతో రైతులు సొసైటీలనే ఆశ్రయించాల్సి వస్తుంది.

30శాతం అధికంగా దిగుమతి

కొవ్వూరులో ఇప్పటి వరకు 1,750 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. తాళ్లపూడి మండలానికి 1,367 మెట్రిక్ టన్నులు, చాగల్లు మండలానికి సుమారు 1,300 మెట్రిక్ టన్నులు వరకు వచ్చింది. ఇది ఇంటెంట్ కంటే ఎక్కువ అని గతంలో కంటే 30 శాతం ఎక్కువగా వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు వాదన మాత్రం అందుకు భిన్నంగా ఉంది. శుక్రవారం మలకల్లి సొసైటీ వద్దకు యూరియా లారీ వచ్చిందన్న సమాచారం అందడంతో మండలంలోని మలకపల్లి, పెద్దేవం, తిరుగుడుమెట్ట తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు యూరియా కోసం చేరుకున్నారు. సొసైటీల్లో యూరియా కృత్రిమ కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు నిచ్చిన వారికి మాత్రం ఎక్కువగా ఇస్తున్నారాని ఆరోపిస్తున్నారు.

ఒక బస్తానే ఇస్తున్నారు

తిరుగుడుమెట్టకు చెందిన రైతులు యూరియా కోసం తీవ్రం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తాము అన్నదేవరపేట సొసైటీ పరిధిలో ఉన్నామని అక్కడకు యూరియా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని గంటల తరపడి లైన్‌లో వేచి ఉంటే, 5 నుంచి 10 ఎకరాలు సాగు చేసే రైతుకు ఒక బస్తా ఇస్తున్నారని, దాన్ని తీసుకువెళ్లి ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. మలకపల్లి సొసైటీకి వెళ్తే తమకు యూరియా ఇవ్వడం లేదని సక్రమంగా రైతులందరికి అవసరం మేరకు సరఫరా చేయాలని కోరుతున్నారు. మొదటి దఫా మాత్రమే వేసామని రెండో దఫా యూరియా లేక 10 రోజులుగా వేయలేదని చెబుతున్నారు. ఎకరానికి కనీసం మూడు బస్తాలు అయినా అందించాలని అంటున్నారు.

అధికంగా వాడితే నష్టం తప్పదు..



ఖరీఫ్ సాగులో ఎరువుల యాజామన్యంలో తగిన జాగ్రత్తలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎకరాకు మూడు దఫాలుగా 130 నుంచి 150 కేజీలు మాత్రమే పిచికారీ చేయాలి. నత్రజని ఎరువు సిఫార్సు మేరకు మాత్రమే వేయాలి, లేకుంటే నష్టం తప్పదు.

– జి రుచిత, మండల వ్యవసాయాధికారిణి, తాళ్లపూడి

యూరియా లేక ఇబ్బందులు



యూరియా లేక గ్రామంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నాం. మలకపల్లి సొసైటీలో తమకు యూరియా ఇవ్వడం లేదు. 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. యూరియా సరఫరా చేయాలి.

– గాజుల శేషు, తిరుగుడుమెట్ట, కౌలు రైతు.

కొరత లేకుండా చూడాలి..



మా గ్రామం నుంచి అన్నదేవపేట, లేదంటే మలకపల్లి 5 కిలోమీటర్లు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వస్తుంది. పైగా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. కొందరు అవసరం లేకపోయినా యూరియా తీసుకుని వెళ్లతున్నారు.

–జి రామకృష్ణ, తిరుగుడుమెట్ట, కౌలు రైతు

కమిటీ సభ్యులదే భాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నిరంజన్

పెరవలి: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే ప్రతి గ్రామంలో ఎటువంటి సంఘటనలు, గొడవలు జరిగినా కమిటీ సభ్యులే భాధ్యత వహించాలని, అందుకు కావలసిన అనుమతులు తీసుకోని నిర్వహించాలని తహసీల్దార్ కె.నిరంజన్ సూచించారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండపాల్లో మైక్ పెట్టుకోవాలంటే తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుమతులు పొందాలన్నారు. మండపాలు రోడ్లు పై ఏర్పాటు చేయకుండా నిలువరించవలసిన భాధ్యత అధికారులదేనన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా బైండవర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

నిడదవోలు రూరల్: వినాయక చవితి ఉత్సవాల ఏర్పాటు అనుమతులకు పోలీస్‌శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు తెలిపారు. మండలంలోని తాడిమళ్ల, పందలపర్రు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను శుక్రవారం పరిశీలించి స్టేషన్ పరిధిలో అనుమతులు పొందే విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ ద్వారా మండలపాల నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందవచ్చన్నారు. ఏఎస్సై ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి



కొవ్వూరులో రక్తదానం చేస్తున్న జక్కంపూడి రాజా

తాళ్లపూడి(కొవ్వూరు): సమాజంలో నేటి యువత రక్తదానం వంటి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కొవ్వూరులో శుక్రవారం పద్మభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి 70వ పుట్టినరోజు వేడుకలను అభిమానులు నిర్వహించారు. కొవ్వూరు పట్టణ చిరంజీవి యువత అధ్యక్షుడు గంటా చిరంజీవి, కొత్తపేట రాజాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జక్కంపూడి రాజా స్వయంగా రక్తదానం చేశారు. సుమారు 60 మంది అభిమానులు ఆయనతో పాటు రక్తదానం చేశారు. ఈ మేరకు జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. దుద్దపూడి రామచంద్ర, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ , ఎస్‌కె.మహాలక్ష్మి, నామ పరమేష్, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

గోదారమ్మ ఉగ్రరూపం



తీపర్రులో నీటమునిగిన పుష్కరాల రేవులో శివుడు

- నీటమునిగిన 1,000 ఎకరాల పంటలు
- గగ్గోలు పెడుతున్న లంక రైతులు

పెరవలి: గత మూడు రోజులుగా నిలకడగా ఉన్న గోదావరి రాత్రికి రాత్రే లంకలను ముంచెత్తటంతో లంక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఊహించని విధంగా గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వ్యవసాయ ఉత్పత్తులు ఒబ్బిడి చేసుకునే పరిస్థితి కూడా లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం దిగువ లంకలు మునిగి ఉండగా శుక్రవారం తెల్లవారుజామున ఎగువ లంకలను ముంచెత్తటంతో కూరగాయల పంటలు, పూల తోటలు నీటిలో నానుతున్నాయని, పంటలన్నీ కుళ్లిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లెదుటే పంటలు పాడైపోవడంతో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆరుగాళం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో నోటికి దక్కకుండా పోయిందని వాపోతున్నారు. మండలంలో కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల వద్ద 2,200 వందల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. వీటిలో 1,000 ఎకరాలు పూర్తిగా మునిగి ఉన్నా మిగిలిన 1,200 ఎకరాలు పైకి కనిపిస్తున్నాయి. ఖోఖో, అరటి, కంద, పసుపు, పామాయిల్, చెరకు తోటలతో పాటు జామ, బొప్పాయి, కొబ్బరి, తమల పాకుతోటలు, కూరగాయల పంటలు, పూలతోటలు, మొక్కజొన్న తోటలు నిలువునా మునిగిపోయాయి. వాణిజ్య పంటలైన కంద, పసుపు, చెరకు, అరటి పంటలకు ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టిన పెట్టుబడి గంగా పాలైందని తెలిపారు.

పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

వరద ఉధృతి కారణంగా ముందస్తుగా గోదావరి లంకల్లో ఉండే పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ సత్యనారాయణ కోరారు. మండలంలోని లంక గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉందని దీనిని రైతులు దృష్టిలో పెట్టుకుని పశువులను సురక్షిత ప్రాంతాలకు తీసుకువెళ్లాలని ఆదేశించారు.

ఉధృతంగా గోదావరి

తాళ్లపూడి(కొవ్వూరు): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా అధికారులు బుధవారం రాత్రి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 10 గంటల సమయంలో గోదావరి నీరు 48 అడుగుల ఎత్తులో ఉండగా, గురువారం ఉదయం నాటికి 50 అడుగులను మించి ప్రవహించడం ప్రారంభించింది. శుక్రవారం కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇంకా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తూనే ఉండటంతో రాబోయే గంటల్లో నీటి మట్టం మరింత పెరిగే అవకాశముందని నదిలోకి ఎవరు దిగరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.



కానూరు అగ్రహారంలో నీటమునిగిన లంకపంటలు



ముక్కామలలో నీటమునిగిన పంటలు



కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద వరద ఉధృతి

గ్రామ దేవతలకు శ్రావణ మాస సారె



అమ్మవారికి సమర్పించే సారెతో పూర్వ విద్యార్థులు



సారెతో పాదయాత్రగా వెళ్తున్న మహిళలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి శ్రావణ మాసం పురస్కరించుకుని చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన పూర్వవిద్యార్థులు శుక్రవారం సారె సమర్పించారు. ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు శ్రావణ మాసం సారె

తాళ్లపూడి: అన్నదేవరపేటలో బీసీ కాలనీ వద్ద వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవతలకు ఆడపడుచులు సారె సమర్పించారు. గ్రామంలోని ఆడపడుచులందరూ పళ్లు, నూతన వస్త్రాలు, పిండి వంటలు, పసుపు కుంకుమలతో వేగులమ్మ, బంగారమ్మ తల్లులకు, గ్రామంలో నలుదిక్కున కొలువైయున్న నలుగురు గ్రామ దేవతలకు సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పురోహితులు పెద్దింటి శ్యామ్ మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా, సుఖ సంతోషాలు, పాడిపంటలతో వర్థిల్లాలని అమ్మవారికి సారె సమర్పించామన్నారు.

పింఛన్లు పీకేసిన కూటమి

- అర్హతలు ఉన్నా అకారణంగా తొలగింపు
- మండలంలో 59 మందికి నోటీసులు

నల్లజర్ల: పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వామిశెట్టి పరమేశ్వరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన నల్లజర్లలో విలేకర్లతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగ పింఛన్ రూ.6వేలకు పెంచామని ఓవైపు గొప్పలు చెప్పకుంటున్న కూటమి, ఉన్నఫలంగా వందల సంఖ్యలో అర్హులను అకారణంగా తొలగించేశారన్నారు. రీవెరిఫికేషన్ పేరిట పరిశీలన చేసి ఒక్క నల్లజర్ల మండలంలోనే 59 మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేసి అనర్హులుగా నోటీసులు పంపినట్టు ఆయన మండిపడ్డారు. దీంతో బాధితులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమకు అన్యాయం చేయవద్దని, వైకల్యం చూసి కనికరించాలని వేడుకుటుంటున్నా ఈ ప్రభుత్వానికి దయలేదని దుయ్యబట్టారు.

గతంలో ఏడాదికి రెండుసార్లు..

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెలల్లో ఎటువంటి సిఫార్సులు లేకుండానే లబ్ధిదారుల ఎంపిక జరిగేదన్నారు. గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికి వెళ్లాల్సిన పని లేకుండా పింఛన్ పొందేవారన్నారు. కనీసం కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారో కూడ చెప్పలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.

సత్యసాయి నీటి సరఫరా నిలుపుదల

గోపాలపురం: సత్యసాయి మంచినీటి కార్మికులు శుక్రవారం నుంచి తాగునీటి సరఫరాను నిలుపుదల చేసినట్లు యూనియన్ నాయకులు దాసరి రవి, పెంటపాటి రమేష్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. గత 10 నెలలుగా జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నా సంబంధిత కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 మండలాలకు సత్యసాయి మంచినీటి పథకం ద్వారా ప్రజలు నీరు అందిస్తున్నా మా కుటుంబాల్లో మాత్రం పస్తులు ఉంటున్నామని ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో మంచినీటి ట్యాంకుల వద్ద నిరాహార దీక్షలు చేపడతామని సభ్యులు హెచ్చరించారు.

మహిళల సామూహిక



ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు



ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేపడుతున్న భక్తులు

నిడదవోలు (ఉండ్రాజవరం): తాడిపర్రు గ్రామంలో ఆదర్శనగర్‌లో కొలువైన కనకదుర్గమ్మ ఆలయం వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలతో దుర్గాదేవికి పూజలు చేశారు. విశేషంగా అమ్మవారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పెరవలి: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు నిర్వహించిన వ్రత కార్యక్రమాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించారు. సుమారు 650 మంది మహిళ భక్తులు వ్రతంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మండలంలోని ఖండవల్లి, కాకరపర్రు, కానూరు, తీపర్రు గ్రామాల్లోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎయిర్ కండీషనర్ బహూకరణ

గోపాలపురం: గోపాలపురం మండల పరిషత్ కార్యాలయానికి చిట్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జిల్లా పెన్షర్ల సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి పీతల ప్రసాద్ బాబు రూ.50 వేలు విలువైన ఎయిర్ కండీషనర్‌ను శుక్రవారం ఎంపీడీవో జి.రాజ్‌మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

నిడదవోలు (ఉండ్రాజపురం): మండలంలోని పాలంగి గ్రామానికి చెందిన ఆలపాటి సత్యవతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు ఇనుకొండ సురేష్ కుమార్ శుక్రవారం ఆమెను పరామర్శించారు. బాధితురాల వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.